సమస్యల్లో సంక్షేమ వసతిగృహం

- శిథిలావస్థలో పెద్దపల్లి అమర్‌నగర్ ఎస్సీ హాస్టల్ భవనం
- పెచ్చులూడుతున్న పైకప్పు
- విద్యార్థుల బిక్కు..బిక్కు
- దుర్గంధభరితం.. దోమలతో సహవాసం..
- పట్టించుకోని అధికారగణం

శిథిలావస్థకు చేరిన అమర్‌నగర్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్ భవనం

పెద్దపల్లి కమాన్, ఆగస్టు 11: పెద్దపల్లి పట్టణం అమర్‌నగర్‌లోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహం సమస్యల వలయంలో చిక్కుకున్నది. పది గదులున్న ఈ భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులూడుతున్నది. దీంతో విద్యార్థులు ఎప్పుడు కూలుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. వాటర్ ట్యాంకు పాడైపోయింది. మరమ్మతు చేయించకపోవడంతో నీరందడంలేదు. దీంతో విద్యార్థులకు బోరు నీరే దిక్కయింది. కరెంట్ సౌకర్యం కూడా లేదు.. బాత్‌రూంల డోర్లు విరిగిపోయాయి. హాస్టల్ ఆవరణను నాలుగైదు రోజులకోసారి కూడా శుభ్రం చేయించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మిగిలిన ఆహారపదార్థాలు హాస్టల్ ఆవరణలోనే వేయడంతో ఈగలు, దోమలు తయారై విద్యార్థులు అనారోగ్యం బారినపడుతున్నారు. అల్పాహారం, అన్నం, కూరలు నాణ్యతగా లేకపోగా, వాటిలో రాళ్లు, పురుగులు వస్తుండడంతో విద్యార్థులు ఖాళీ కడుపుతో కాలం వెల్లదీస్తున్నారు. వర్షం కురిసిన ప్పుడల్లా గదుల్లోకి నీరు చేరడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. భవనం కిటికీలు సరిగ్గా లేకపోవడంతో పాములు, తేళ్లు, విష పురుగులు గదుల్లోకి వస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి హాస్టల్‌ను వేరే భవనంలోకి తరలించి ఇబ్బందులను తొలగించాలని వేడుకుంటున్నారు..

పెచ్చులూడిన భవనం పై కప్పు

తలుపులు ఊడిపోయి అపరిశుభ్రంగా ఉన్న బాత్‌రూమ్‌లు

పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నయ్..

వర్షం పడినప్పుడల్లా హాస్టల్ భవనం పై కప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఎప్పుడు కూలిపోతుందోనని భయమేస్తున్నది. ఫ్యాన్లు సరిగ్గా తిరగడం లేదు. గదుల్లో కరెంట్ సక్రమంగా ఉండడంలేదు. కిటికీలకు డోర్లులేవు. గదులు సరిపోకవడంతో ఒక్కొ గదిలో 10 మంది ఉంటున్నం. హాస్టల్‌ను వేరే భవనంలోకి మార్చాలి.

- బొల్లెడ్ల రాంచరణ్, హాస్టల్ విద్యార్థి

బాత్రూమ్‌లు శుభ్రం చేయరు..

హాస్టల్‌లోని బాత్రూమ్‌లు కంపుకొడుతున్నయ్.. నాలుగైదు రోజుల కోసారి కూడా శుభ్రం చేయరు. వాటర్ ట్యాంకు పాడుకావడంతో నీళ్లు రావడం లేదు. దీంతో ఆరు బయటే స్నానాలు చేస్తున్నాం. హాస్టల్‌లో వార్డెన్ లేకపోతే బోరింగ్ నీళ్లనే వాడుకోవాల్సి వస్తుంది. మొన్నటి వరకు తాగేందుకు మినరల్ వాటర్ కూడా ఉండేది కాదు. అధికారులు సౌకర్యాలను కల్పించాలి.

- ఈర్ల యశ్వంత్, హాస్టల్ విద్యార్థి

అన్నంలో పురుగులు వస్తున్నయి..

మేము తినే అన్నంలో అప్పుడప్పుడు పురుగులు, రాళ్లు వస్తున్నయి. సరిపోయేంత ఆహారం పెట్టడం లేదు. రుచికరంగా ఉండడం లేదు. చాలా సార్లు అన్నం, కూరలు చెత్త కుండీలో పడేవేసినం. బయట నుంచి కూరలు, టిఫిన్లు తెచ్చుకుని తింటున్నాం. నాణ్యమైన భోజనం పెట్టాలని వార్డెన్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదు.

- కుమ్ర రామేశ్వర్, హాస్టల్ విద్యార్థి

సేవలందించడంలో వైద్యులు విఫలం

- పెద్దపల్లి మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

మాట్లాడుతున్న మాజీ జడ్పీ చైర్మన్ మధూకర్

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 11: 'పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు వైద్యసేవ లందించడంలో డాక్టర్లు విఫలమవుతున్నారు... బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.' అని మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల క్రితం కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేటకు చెందిన రామమ్మ అనే మహిళ ఆనారోగ్యంతో దవాఖానకు వస్తే నామమాత్రంగా పరీక్షలు చేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని నడిపే మంత్రికి, రైతు పక్షపాతి అయిన ఎమ్మెల్యేకు జిల్లా దవాఖానలోని పరిస్థితులు తెలియకపోవడం సిగ్గు చేటన్నారు. వారికి పదవులపైన ఉన్న ప్రేమ ప్రజల అరోగ్యంపైన లేదని ఆరోపించారు. ఇటీవల ప్రమాదవశాత్తు దవాఖానలో సెప్టిక్ ట్యాంక్‌లో పడి బాలుడి మృతి, డెలివరీ టైంలో పుట్టిన పాప చెయ్యి విరిగిన ఘటనలు మరువక ముందే జర్వంతో దవాఖానకు వస్తే డాక్టర్లు నీర్లక్ష్యంగా వ్యవహరిడం శోచనీయమన్నారు. కేసీఆర్ పాలనలో ప్రభుత్వ దవాఖానలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. సమావేశంలో ఓదెల దేవస్థాన కమిటీ చైర్మన్ మేకల మల్లేశం యాదవ్, మాజీ జడ్పీటీసీ గంట రాములు, బీఆర్ఎస్ నాయకులు శంకర్ లాల్, బండారు శ్రీనివాస్, మారం తిరుపతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించడం అభినందనీయం

నృత్యం చేస్తున్న కళాకారులు

జ్యోతినగర్, ఆగస్టు 11: అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన తారా ఆర్ట్స్ అకాడమీ వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని గుర్తించి నల్లవజ్రం పురస్కారాలు అందజేయడం అభినందనీయమని వక్తలు ప్రశంసించారు. ఎన్టీపీసీ ఈడీసీ ఆడిటోరియంలో తారా ఆర్ట్స్ అకాడమీ నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయస్థాయి కళోత్సవాలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమానికి వచ్చిన అతిథులు మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమంతో సింగరేణి వ్యాప్తంగా ప్రతిభ కలిగిన కళాకారులు, క్రీడాకారులు, వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి మరింత ప్రోత్సాహం లభించనుందన్నారు. వేదికలో కళాకారులు చేసిన నృత్య, గీతా నాటిక ప్రదర్శనలు అలరింప జేయగా, హైదరాబాద్, కరీంనగర్, స్థానిక కళాకారులు ప్రదర్శించిన పేరిణి కూచిపూడి నృత్యాలు, గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ ఏసీపీ ప్రతాప్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సంకె రాజేశ్, మేకల శ్రీధర్ యాదవ్, టీవీ నటినటులు గోపాలస్వామి, ప్రణయ్‌కుమార్, లోహిత్‌కుమార్, లిరీష, చరిష్మా, సోహెల్, నిర్వాహకులు కే స్వామి, మేజిక్ రాజా, దయానర్సింగ్, దామోర శంకర్, చల్లా ప్రవీణ్‌కుమార్, నర్సయ్య, తిరుమల్, చీకటి అంజ య్య, సుంకే రాజు, డాక్టర్ సాయి ఉన్నారు.